RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ, | ఎడిటర్: చెరుకు ఉపేందర్ | శుక్రవారం | 7-6-2024
సంపుటి: 1 | సంచిక : 295 | పేజీలు :4 | వెల: 5

## 6 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత: కిషన్‌రెడ్డి



**దిల్లీ: ప్రభాత సూర్యుడు**

భాజపా రిజర్వేషన్లు రద్దు చేస్తుందంటూ కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేసిందని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలోని 47 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో అత్యధిక ఓట్లు వచ్చాయి. సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ పోటీ చేయలేదు.. ఎంఐఎం పోటీ చేసింది. లోపాలు సరిదిద్దుకుని భవిష్యత్తులో రాష్ట్రంలో మా పార్టీ అధికారంలోకి వస్తుంది. 6 నెలల్లోనే కాంగ్రెస్‌పై ప్రజా వ్యతిరేకత మొదలైంది. భాజపాకు తెలంగాణ ప్రజలు 35 శాతానికిపైగా ఓట్లు వేశారు. మాపై విశ్వాసం ఉంచి.. అధిక స్థానాల్లో గెలిపించారు. అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఒక్క శాతం ఓటింగ్ మాత్రమే పెరిగింది. తెలంగాణలో చాలా చోట్ల భారాసకు డిపాజిట్లు రాలేదు. రాష్ట్ర ప్రజలు కాషాయ పార్టీకి అండగా నిలబడ్డారు. గతంలో రేవంత్‌రెడ్డి గెలిచిన మల్కాజిగిరిలో కూడా మేం గెలిచాం. కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్, సిద్ధిపేట ఉన్న మెదక్‌లో విజయం సాధించాం. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారు. ఆ పార్టీ ఇచ్చిన హామీలు ఎలా అమలు చేస్తారో భాజపా ప్రశ్నిస్తుంది. అమిత్‌షాపై తప్పుడు కేసు పెట్టారు. హస్తం పార్టీ మోసాలను ప్రజలకు వివరిస్తాం. ఏపీలో అద్భుతమైన మెజార్టీతో ఎన్డీయే అధికారంలోకి వచ్చింది. అక్కడి ప్రజలకు కృతజ్ఞతలు" అని కిషన్‌రెడ్డి తెలిపారు.

## ముగిసిన కోడ్.. 'ప్రజావాణి' తిరిగి ప్రారంభం




లోక్‌సభ ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా పడిన ప్రజావాణి కార్యక్రమం శుక్రవారం నుంచి తిరిగి ప్రారంభం కానుంది. ఈ విషయాన్ని గురువారం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి వెల్లడించారు. దేశ వ్యాప్తంగా లోక్ సభ ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నందు వల్ల ప్రజావాణి అర్జీల కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా పడిందని చిన్నారెడ్డి పేర్కొన్నారు. కోడ్ ముగిసిన నేపథ్యంలో ప్రజావాణి అర్జీల స్వీకరణ కార్యక్రమం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో ప్రతి వారం మంగళ, శుక్ర వారాల్లో కొనసాగుతుందని చిన్నారెడ్డి వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా ప్రజావాణిలో అందజేయాలని చిన్నారెడ్డి కోరారు. ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్‌గా రాష్ట్ర మున్సిపల్ డైరెక్టర్ దివ్య వ్యవహరిస్తున్నారు.

## 'వందమంది మోడీలు వచ్చినా బీఆర్ఎస్‌ను ఏమీ చేయలేరు'

సీఎం రేవంత్ రెడ్డి ఆడలేక మద్దెల ఓడు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ విమర్శించారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్‌పై ప్రేలాపనలు పేలుతున్నారని మండిపడ్డారు. వాస్తవంగా బీజేపీకి ఓటు బదిలీ చేసింది కాంగ్రెస్ నేతలే అని అన్నారు. బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థులను దింపిందని విమర్శించారు. సిద్ధిపేటలో హరీష్ రావు బీజేపీకి ఓట్లు బదిలీ చేశారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించడం కరెక్ట్ కాదని అన్నారు.రేవంత్ రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డి పల్లిలో బీజేపీకే ఆధిక్యత వచ్చిందని గుర్తుచేశారు. అంటే అక్కడ బీజేపీకి రేవంత్ రెడ్డే ఓట్లు బదిలీ చేశారా? అని ప్రశ్నించారు. కొండంగల్ అసెంబ్లీ ఎన్నికల్లో 30 వేలకు పైగా మెజారిటీ తెచ్చుకున్న రేవంత్ ఈ ఎన్నికల్లో 22 వేలకు పడిపోయారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన మెజారిటీ వస్తే మహబూబ్ నగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి గెలిచే వారని అన్నారు. రేవంత్ రెడ్డి బీజేపీకి ఓట్లు బదిలీ చేసి అక్కడ డీకే అరుణను గెలిపించారని ఆరోపించారు. స్వయంగా రాష్ట్ర మంత్రులే బీజేపీకి అవయవదానం చేశారని అన్నారు. వెయ్యిమంది రేవంత్‌లు వంద మంది మోడీలు వచ్చినా బీఆర్ఎస్‌ను ఏమీ చేయలేరని అన్నారు.

# ఎన్డీయే ఆపరేషన్ ఆకర్ష్



**దిల్లీ: ప్రభాత సూర్యుడు**

లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో నరేంద్ర మోడీ నేతృత్వంలోని బీజేపీ మెజారిటీ కోల్పోయి 240 సీట్లకు పరిమితమైంది. దాంతో ప్రభుత్వ ఏర్పాటుకు మిత్రపక్షాలపై ఆధారపడాల్సి వచ్చింది. ఇప్పుడు ఎన్డీఏ కూటమి 293 సీట్లతో మూడవసారి నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. బుధవారం జరిగిన కూటమి పక్షాల సమావేశంలో మిత్రపక్షాలు నరేంద్ర మోడీనే ప్రధానిగా ఎన్నుకున్నాయి. ఈ సందర్భంగా వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు ఎన్డీఏ మరింత సామర్థ్యంతో పనిచేస్తుందని మోడీ ఈ సందర్భంగా భాగస్వామ్య పక్షాలకు హామీ ఇచ్చారు. గత 2014, 2019 ఎన్నికల్లో బీజేపీ స్వయంగా మ్యాజిక్ ఫిగర్ 272ని దాటి సీట్లను కైవసం చేసుకుంది. కానీ, ఈ సారి మాత్రం మెజారిటీకి కేవలం 32 సీట్ల దూరంలో ఆగిపోయింది. సొంత సీట్లు తగ్గిపోవడంతో మిత్రపక్షాల్లో 16 సీట్లు గెలుచుకున్న చంద్రబాబు నాయుడు టీడీపీ, నితీష్ కుమార్ జేడీయూ (12), ఏక్నాథ్ షిండే శివసేన (7), చిరాగ్ పాశ్వాన్‌కు చెందిన లోక్ జనశక్తి పార్టీ–రామ్ విలాస్ (5) పార్టీలు బీజేపీ మెజారిటీకి కీలకంగా మారాయి. అయితే, సంకీర్ణ ప్రభుత్వంగా మోడీ మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో మిత్రపక్షాలు తమ డిమాండ్లు, మంత్రి పదవుల లిస్టును వారు బీజేపీ ముందు పెడుతున్నారు. అవకాశాన్ని వదులుకోకూడదనే ఉద్దేశ్యంతో వారు కీలక పోర్ట్‌ఫోలియోలను దక్కించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ పరిస్థితులు చూస్తుంటే వరుసగా రెండుసార్లు సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బీజేపీకి ఇది ఇష్టం లేదన్నట్టు కనిపిస్తోంది. సీట్లు తగ్గాయనే కారణంతో మిత్రపక్షాల డిమాండ్లకు లొంగకూడదనే ఉద్దేశంలో బీజేపీ ఉన్నట్టు సమాచారం. కీలక మంత్రిత్వ శాఖలను తమ వద్దే ఉంచుకోవాలని భావిస్తోంది. దీనికోసం బీజేపీలోని కీలక నేతలైన రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాలకు మోడీ బాధ్యతలు అప్పగించినట్టు తెలుస్తోంది.

### మిత్రపక్షాల డిమాండ్లు..

బీజేపీ తర్వాత ఎన్డీఏ కూటమిలో ఎక్కువ సీట్లు గెలిచిన టీడీపీ 16 మంది ఎంపీలను కలిగి ఉంది. ఎన్డీఏ మిత్రపక్షాల సమావేశానికి టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. ప్రధానిగా మోడీగా ఎన్డీఏకు మద్దతిస్తున్నట్టు చెప్పారు. అయితే, కేంద్ర ప్రభుత్వంలో టీడీపీ భాగమవుతుందా లేక బయటి నుంచి మద్దతిస్తుందా అనే విషయంలో బీజేపీ అగ్ర నాయకత్వానికి ఆయన ఇంకా స్పష్టం చేసినట్టు ఖరారు కాలేదు. చర్చల తర్వాత పార్టీ ప్రభుత్వంలో చేరవచ్చని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. బీజేపీ తమ పార్టీకి ఎలాంటి హామీలు ఇస్తుందనే విషయంపై స్పష్టత వచ్చే వరకు వేచి ఉండాలని వారు భావిస్తున్నారు. ప్రస్తుత సమాచారం ప్రకారం టీడీపీ లోక్‌సభ స్పీకర్ పదవిని గట్టిగా ఆశిస్తోంది. అలాగే నాలుగు కేంద్ర మంత్రి పద్వులను, ఒక సహాయ మంత్రి పదవిని కోరుతోంది. అంతేకాకుండా గతంలోనూ వాజ్‌పేయి ప్రభుత్వ హయాంలో ఎన్డీయే కన్వీనర్‌గా చంద్రబాబు నాయుడు వ్యవహరించారు. మళ్లీ 20 ఏళ్ల తర్వాత కింగ్ మేకర్ అవకాశం రావడంతో ఎన్డీయే కూటమిలో టీడీపీ కీలక పాత్ర పోషించే అవకాశం లభించింది. మరో కీలక జేడీయూ అధినేత నితీష్ కుమార్ సైతం పలు కీలక శాఖలను ఆశిస్తున్నట్టు తెలుస్తోంది. గతంలో నితీష్ కుమార్ రైల్వే, వ్యవసాయం, రవాణా శాఖలను చేపట్టారు. ఇప్పుడు కూడా వాటినే అడుగుతున్నట్టు సమాచారం. కానీ బీజేపీ అందుకు సుముఖంగా లేదని తెలుస్తోంది. అంతేకాకుండా హోంశాఖ, రక్షణ, ఆర్థిక, విదేశీ వ్యవహారాలు శాఖలను తమ వద్దే ఉంచుకోవాలని బీజేపీ అగ్రనాయకత్వం ఇప్పటికే స్పష్టం చేసినట్టు వినవస్తోంది.

### తటస్థుల కోసం వేట..

ఓవైపు సీట్లు మ్యాజిక్ ఫిగర్‌కు దూరం కావడం, మరోవైపు మిత్రపక్షాలపై ఆధారపడే పరిణామాలు చోటుచేసుకోవడంతో బీజేపీ తన స్టైల్‌లో ఈ వ్యవహారాన్ని చక్కబెట్టేందుకు ప్రయత్నిస్తోంది. పలు రాష్ట్రాల్లో ప్రభుత్వాలను సైతం చీల్చి అధికారం దక్కించుకున్న బీజేపీకి మిత్రపక్షాలపైనే ఆధారపడటం ఇష్టంలేదు. దానికోసం ఇతర పార్టీల వారిని ఎన్డీఏలోకి ఆహ్వానించే ఎత్తుగడలను సిద్ధం చేస్తోంది. ఇప్పటికే తటస్థ పార్టీల నేతలతో సంప్రదింపులు కూడా ప్రారంభించినట్టు రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. ఆ బాధ్యతలను కూడా రాజ్‌నాథ్ సింగ్, అమిత్‌షా, జేపీ నడ్డాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

# రుద్రారం గొలుసు కట్టు కాలువ బాధిత రైతుల సమస్యలను పరిష్కరిస్తాం

- గొలుసు కట్టు కాలువ ఆయకట్టు, అక్రమ కట్టడాలను పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు
- నిర్మాణానికి ఎలాంటి ఎన్‌ఓసి అనుమతులు లేవని స్పష్టం
- నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న అక్రమ కట్టడాల నిలిపివేత
- పెట్రోల్ బంకుకు ఎదురుగా జాతీయ రహదారి 65 పై కల్వర్టు పూడికపై సీరియస్
- కల్వర్టు పూడికపై ఆర్ అండ్‌బి అధికారులకు రైతుల ఫిర్యాదు
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- ఇరిగేషన్ అధికారి ఏఈ చక్రవర్తి

**సంగారెడ్డి – ప్రభాత సూర్యుడు**

పటాన్ చెరు మండలం, రుద్రారం జాతీయ రహదారి 65 పై ఉన్నటువంటి రుద్రారం నుండి లకడారం వెళ్లే ప్రధాన గొలుసు కట్టు కాలువపై సర్వే నెంబర్ 723/2 లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నటు వంటి అక్రమ కట్టడాలను నిలిపివేస్తున్నట్టు మండల ఇరిగేషన్ అధికారి ఏ ఈ చక్రవర్తి ఒక ప్రకటనలో తెలిపారు. రుద్రారం గొలుసుకట్టు కాలువపై జరుగుతున్న అక్రమ నిర్మాణాలను ప్రభాత సూర్యుడు దినపత్రిక గత కొద్ది రోజులుగా వరుస కథనాలతో వెలుగులోకి తీసుకొచ్చింది. దీనిపై స్పందించిన రెవెన్యూ, ఇరిగేషన్ జిల్లా యంత్రాంగం కాలుపై జరుగుతున్న అక్రమ నిర్మాణాలను పరిశీలించి తాత్కాలికంగా నిలిపివేశారు. ఎన్నికల విధుల అనంతరం తిరిగి ఈ నెల ఆరవ తేదీన క్షుణ్ణంగా పరిశీలిస్తామని ఇరిగేషన్ అధికారులు తెలిపిన అంశం విదితమే. ఈ మేరకు నిన్న మండల ఇరిగేషన్ అధికారి ఏ ఈ చక్రవర్తి గొలుసుకట్టు కాలువ పరిసర ప్రాంతాలను స్థానిక రైతులు, బీఎస్పీ నాయకులతో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. జాతీయ రహదారి 65పై పెట్రోల్ బంకుకు ఎదురుగా ఉన్నటువంటి కల్వర్టు పూడికలను రైతులు అధికారుల దృష్టికి తీసుకురాగా, కల్వర్టు అడ్డంగా నిర్మించిన పెట్రోల్ బంక్ నిర్మాణాన్ని పరిశీలించిన ఏ ఈ చక్రవర్తి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక రైతులు, నాయకులు గొలుసుకట్టు కాలువకు సంబంధించిన పలు అంశాలను అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా ఏ ఈ చక్రవర్తి మాట్లాడుతూ.. సమస్య స్పష్టంగా కనిపిస్తుందని, సర్వే నెంబర్ 723/2 లో నిర్మిస్తున్న కట్టడాలకు ఇప్పటివరకు ఇరిగేషన్ శాఖ నుండి ఇలాంటి ఎన్‌ఓసి అనుమతులు లేవని స్పష్టం చేశారు. అదేవిధంగా జాతీయ రహదారిపై



రైతుల నుండి గొలుసుకట్టు కాల్వ వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఏఈ చక్రవర్తి

పెట్రోల్ బంకుకు ఎదురుగా ఉన్నటువంటి కల్వర్టు పూడికల అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. గొలుసుకట్టు కాలువ ఏ మేరకు కబ్జాకు గురైందో ఒక అవగాహనకు వచ్చినట్లు పేర్కొన్నారు. గొలుసుకట్టు కాలువ అంశాన్ని ఉన్నతాధికారులతో చర్చించిన తరువాత రెండు మూడు రోజులలో రైతుల సమస్య పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని వివరించారు.

### అక్రమాలను ఎండగడితే పోలీసు కేసులు పెడతారా ?

### వాస్తవాలను వెలుగులోకి తెచ్చిన జర్నలిస్టులపై అక్రమ కేసులా ?

గొలుసు కట్టు కాలువను మాయం చేస్తూ నిర్మిస్తున్న అక్రమ కట్టడాలపై 'ప్రభాత సూర్యుడు' దినపత్రిక రాస్తున్న వరుస కథనాలకు ఉలికి పడ్డ కబ్జా కోరులు, అక్రమ నిర్మాణ దారులు అక్రమ కేసులకు పాల్పడుతున్నారు. పోలీసు కేసులు పెట్టి భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులచే ఫోన్లు చేయించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. తమ బండారం బయటపడితే అసలుకే మోసం వస్తుందన్న ఆందోళనలో బెదిరింపులు, పోలీసు కేసులతో భయపెడుతున్నారు. వాస్తవాలను వెలుగులోకి తీసుకొచ్చి, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం పాత్రికేయుల నేరమా ? ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటున్న జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టి భయపడితే అక్రమాలు కనుమరుగవుతాయా ? ఇలాంటి తాటాకు చప్పుడు బెదిరింపులకు భయపడేది లేదని పలువురు ప్రజా సంఘాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి.

ప్రభాత సూర్యుడు వరుస కథనాలతో వెలుగులోకి వచ్చిన గొలుసు కట్టు కాలువ కబ్జా పై స్థానిక రుద్రారం గ్రామస్తులు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. రుద్రారం గ్రామ బాధిత రైతులు కరుణాకర్ రెడ్డి, చంద్రారెడ్డి, ప్రద్యుమ్నారెడ్డి, నరసింహారెడ్డి,



ఏ ఈ చక్రవర్తికి కాలువకు సంబంధించిన వివరాలను వివరిస్తున్న స్థానిక రైతు



రైతులతో కలిసి గొలుసుకట్టు కాలువ ఆయకట్టును పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారి చక్రవర్తి

విష్ణువర్ధన్ రెడ్డి, మంగలి యాదయ్య, పుదులాపురం మహేష్ లు ప్రభాత సూర్యుడు ప్రత్యేక ప్రతినిధితో మాట్లాడుతూ.. ఇంత పెద్ద అక్రమాన్ని ఇరిగేషన్ శాఖ అధికారులకు, రెవిన్యూ శాఖ అధికారులకు వెలుగులోకి తెచ్చిన 'ప్రభాత సూర్యుడు'పాత్రికేయులపై అక్రమ కేసులు పెడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, అక్రమ కేసులు పెట్టి పత్రికల స్వేచ్ఛను హరించలేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల పక్షాన నిస్వార్ధంగా పనిచేస్తున్న ప్రభాత సూర్యుడు పత్రికకు మద్దతుగా రుద్రారం గ్రామ రైతులు, నాయకులు అండగా నిలబడతామని, అవసరమైతే నిరసనలు వ్యక్తం చేస్తామని తెలిపారు.




పెట్రోల్ బంకుకు ఎదురుగా కబ్జాకు గురైన గొలుసుకట్టు కాలువ పై ఉన్నటువంటి కల్వర్టు



బీఎస్పీ నాయకులు బోడబట్ల నర్సింగరావు తో కలిసి కాలువను పరిశీలిస్తున్న అధికారులు